- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం
01-06-2026

సంపుటి : 01 సంచిక : 70 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 70 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha



# టైటిల్ ఆర్సీబీదే

## ఫైనల్లో ఆర్సీబీ చారిత్రాత్మక విజయం

- ఫైనల్లో గుజరాత్ పై 5 వికెట్ల తేడాతో ఆర్సీబీ గెలుపు
- వరుసగా రెండో సారి ఐపీఎల్ ఛాంపియన్‌గా ఆర్సీబీ
- తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 155/8
- ఒంటరి పోరాటంతో హాఫ్ సెంచరీ చేసిన వాషింగ్టన్ సుందర్
- మూడు వికెట్లతో గుజరాత్‌ను దెబ్బతీసిన రసిఖ్ సలాం దార్
- అజేయ అర్ధశతకంతో (75) జట్టును గెలిపించిన విరాట్ కోహ్లీ

3 లో

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఐపీఎల్ 2026 ఫైనల్లో గుజరాత్ టైటాన్స్‌పై అద్భుత ప్రదర్శన కనబరిచి మరోసారి ఛాంపియన్‌గా నిలిచింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన తుది పోరులో ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 155/8 స్కోరు మాత్రమే నమోదు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఆర్సీబీ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ మ్యాచ్‌ను పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. విరాట్ కోహ్లీ, వెంకటేశ్ అయ్యర్ జోడీ వేగవంతమైన ఆరంభం అందించగా మధ్య ఓవర్లలో రజత్ పాటిదార్ ఇన్నింగ్స్‌ను చక్కగా నడిపించాడు. దీంతో ఆర్సీబీ సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకుని టైటిల్‌ను కైవసం చేసుకుంది.




### ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో

# రేవంత్ భేటీ

## శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో చర్చలు

- బెంగళూరు వెళుతూ ఖర్గే ఇక్కడ ట్రావెల్ బ్రేక్
- ఖర్గేకు తెలంగాణ కాంగ్రెస్ నేతల ఘన స్వాగతం
- రాష్ట్ర రాజకీయాలపై కీలక చర్చలకు వేదికైన శంషాబాద్ సమావేశం
- పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరు, భవిష్యత్ వ్యూహాలపై చర్చించినట్లు సమాచారం

హైదరాబాద్ మే 31( మహాప్రభ)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంషాబాద్ లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. ఆయనతో పాటు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఖర్గేను ఆదివారం కలిశారు. ఢిల్లీ నుంచి బెంగళూరు వెళుతూ ఖర్గే శంషాబాద్ లో ట్రావెల్ బ్రేక్ తీసుకున్నారు.. ఈ సందర్భంగా తెలంగాణ నేతలు ఆయనను కలిసి రాష్ట్ర రాజకీయాలు, తెలంగాణలో పార్టీ పరిస్థితి, ఎస్ఐఆర్ సహా పలు కీలక అంశాలపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

-మిగతా 3 లో





## అమెరికాతో రాజీ పడే ప్రసక్తే లేదు

- ఇరాన్ స్పష్టీకరణ
- ప్రముఖ మేథోసంస్థ ఐసీడబ్ల్యూ సీటీపీ వెల్లడి
- ఒప్పందానికి చేరువగా ఉన్నాం.. చర్చలు విఫలమైతే సైనిక చర్య తప్పదు : ట్రంప్

టెహ్రాన్/వాషింగ్టన్ మే 31( మహాప్రభ)

శాంతి ఒప్పందానికి ముందు ఎంఓయూ (అవగాహనా ఒప్పందం) కుదుర్చుకునేందుకు ఇరాన్, అమెరికా తీవ్రంగా కృషి చేస్తున్నాయి. అయితే ఎంఓయూను ఖరారు చేయడానికే చాలా కాలం పడుతోంది. దీనికి కారణం దానిలోని ప్రతి పదాన్ని విశ్లేషించి, చర్చించాల్సి వస్తోంది. ఒక అంశానికి, మరో అంశానికి మధ్య ఉన్న సంబంధాన్ని నిశితంగా పరిశీలి స్తున్నారు. ఉదాహరణకు ఎంఓయూ కుదిరిన తర్వాత 60 రోజులలోగా తుది ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణ యించారు. అయితే ఈ 60 రోజుల ప్రక్రియను వారాల తరబడి కొనసాగుతున్న కాల్పుల విరమ ణకు పొడిగింపుగా భావిస్తారా

-మిగతా 3 లో



## ఆర్టీసీని బలోపేతం చేస్తాం

- గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాలను పెంచుతాం
- పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలో ప్రారంభిస్తాం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల డిమాండ్ పెరిగింది
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ మే 31( మహాప్రభ)

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఆర్టీసీ బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రతిపాదిత బస్ డిపో స్థలాన్ని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయ రమణారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ విజయ రమణారావు, సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి పెద్దపల్లికి ఆర్టీసీ బస్ డిపోను మంజూరు చేశారని తెలిపారు. బస్ డిపో పనులు కొంత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం

-మిగతా 3 లో



### మరో పది రోజుల్లో తెలంగాణకు

## నైరుతి రుతుపవనాలు!


- కేరళ, తమిళనాడు వైపు వేగంగా విస్తరిస్తున్న గాలులు
- రాష్ట్రంలో క్రమంగా తగ్గనున్న పగటి ఉష్ణోగ్రతలు
- ఈరోజు, రేపు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్ మే 31( మహాప్రభ)

భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకనున్నాయి. జూన్ 10 నుంచి 12వ తేదీ మధ్య తెలంగాణలోకి

-మిగతా 3 లో

## పెట్రోల్, డీజిల్‌పై ఎగుమతి సుంకాలు తగ్గింపు




- లీటర్ పెట్రోల్‌పై రూ.3 నుంచి రూ.1.5కి తగ్గింపు
- డీజిల్ మీద రూ.16.5 నుంచి రూ.13.5కు కేంద్రం తగ్గించింది
- జూన్ 1 నుంచే అమల్లోకి

న్యూఢిల్లీ,

పెట్రోల్, డీజిల్ రేట్లపై కేంద్ర ప్రభుత్వం ఎగుమతి సుంకాలను తగ్గించింది. లీటర్ పెట్రోల్‌పై రూ.3 నుంచి రూ.1.5కి తగ్గించారు. అలాగే లీటర్ డీజిల్ మీద రూ.16.5 నుంచి రూ.13.5కు కేంద్రం తగ్గించింది. అటు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ మీద లీటర్‌కు రూ.16 నుంచి రూ.9.5 వరకు తగ్గిస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది.సవరించిన కొత్త రేట్లు జూన్ 1 నుంచే అమల్లోకి వస్తాయని తెలిపింది. ప్రతి 15 రోజులకు ఒకసారి ఎగుమతి సుంకాలపై కేంద్రం మార్పులు చేస్తుంటుంది.



## నేడు కుమ్రం భీం -ఆసిఫాబాద్ జిల్లాకు సీఎం

- రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- విద్యుత్ మౌలిక సదుపాయాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టు, మున్సిపల్ అభివృద్ధి పనులకు శ్రీకారం

హైదరాబాద్ మే 31( మహాప్రభ)

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మొత్తం రూ.112.14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చింతలమానేపల్లి మండలంలోని కోటాల (రవీంద్రనగర్ క్యాంపు నం-2) గ్రామంలో ఏర్పాటు చేయనున్న 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

-మిగతా 3 లో

### భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద

# గృహ విప్లవం

## ఇందిరమ్మ ఇళ్లతో దేశానికి తెలంగాణ మార్గదర్శకం



- 13నెల్లో లక్ష ఇళ్లు పూర్తి.. రెండు నెలల్లో మరో రెండు లక్షలు పూర్తి చేస్తాం
- నేడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండవ విడతకు శ్రీకారం
- కొత్తగూడెంలో సామూహిక గృహప్రవేశాలు
- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ మే 31( మహాప్రభ)

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సొంతింటి కలలను నెరవేర్చడానికి ఉచితంగా ఐదు లక్షల రూపాయలతో భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రం దేశానికి మార్గదర్శక నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార ఌ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అమలు

-మిగతా 3 లో

## రైతులను ఆదుకోవాలి

- రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- రైతు డిస్కం ఏర్పాటు వెనుక కుట్ర ఉంది
- ఈ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళ్తామని స్పష్టం
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్‌మే 31( మహాప్రభ)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, మీటర్లు బిగించబోమన్న సీఎం.. ఆ విషయాన్ని మీడియా చిట్చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటీకరించే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకునేందుకు

-మిగతా 3 లో

# మయన్మార్‌లో భారీ పేలుడు.. 45 మంది మృతి



**నేపిడా**
మయన్మార్‌లో ఆదివారం భారీ పేలుడు చోటుచేసుకుంది. మైనింగ్ పేలుడు పదార్థాలు ఉంచిన భవనంలో జరిగిన ఈ పేలుడులో 45 మంది మృతిచెందగా, 70 మందికిపైగా గాయపడ్డారు. స్థానిక మీడియా తెలిపిన వివరాల ప్రకారం ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చైనా సరిహద్దుకు మూడు కిలోమీటర్ల దూరంలోని నామ్‌ఖమ్ టౌన్‌షిప్‌లోని కౌంగ్‌టప్ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ప్రాంతం మయన్మార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న 'టాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ (టీఎన్‌ఎల్‌ఏ) నియంత్రణలో ఉంది. సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న ఒక వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ ఆదివారం నాటికి ఆరుగురు చిన్నారులతో సహా 45 మృతదేహాలను వెలికితీసినట్లు తెలిపారు.

# జైసల్మేర్‌ను ముంచెత్తిన భారీ ఇసుక తుపాన్..

-ఆకాశాన్ని కమ్మేసిన ఇసుక..


-స్థానికులకు ఇబ్బంది



**న్యూఢిల్లీ మే 31( మహాప్రభ)**
రాజస్థాన్‌ను మరోసారి ఇసుకు తుపాన్ ముంచెత్తింది. జైసల్మేర్ పరిధిలో భారీ ఇసుక తుపాన్ రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జైసల్మేర్ జిల్లాలోని రామ్‌గఢ్, మోహన్‌గఢ్, పీటీఎం టౌన్, నచ్నా సహా అనేక సరిహద్దు ప్రాంతాల్లో ఆదివారం ఇసుకు తుపాన్ ముంచెత్తింది. ఇండియా--పాకిస్తాన్ సరిహద్దులో ఈ ఇసుకు తుపాన్ కారణంగా ఆకాశం మొత్తం ఇసుకతో నిండింది. ఎదురుగా ఏముందో కూడా కనిపించనంతగా ఇసుక కమ్మేసింది. చాలా ఎత్తున ఇసుక ఎగసిపడింది. పగటి వేళలో ఇలా ఇసుక ఎగసి, ఆ ప్రాంతాల్ని మొత్తం చీకటిమయంగా చేసేసింది. కొన్ని కిలోమీటర్ల మేర ఈ ఇసుక తుపాన్ వ్యాపించింది. ఇసుక తుపాన్ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇండ్లలోకి ఇసుక వచ్చి చేరింది. అనేక చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై ఏమీ కనిపించకపోవడంతో పగటిపూటే హెడ్ లైట్ల వెలుగుల మధ్య వాహనాలు నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. అయితే, ఉన్నట్లుండి వాతావరణం మారిపోవడంతో ఒక్క మేలు జరిగిందని స్థానికులు అంటున్నారు. ఎండ ప్రభావం నుంచి ఈ ఇసుకు తుపాన్ కాస్త తెరపి ఇచ్చిందని స్థానికులు చెప్పారు. రాజస్తాన్‌లో ఇసుక తుపాన్ రావడం వరుసగా ఇది రెండోసారి. శనివారం కూడా పలు ప్రాంతాల్లో ఇసుకు తుపాన్ వచ్చింది. మరోవైపు ఈ ప్రాంతంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే, కొన్ని చోట్ల వర్షాలు కూడా పడుతాయని తెలిపింది. బికనేర్, జైపూర్, అజ్మీర్, భరత్‌పూర్, కోట, జోధ్‌పూర్, ఉదయ్ పూర్ ప్రాంతాల్లో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# లెబనాన్‌లోకి చొచ్చుకెళ్లిన ఇజ్రాయెల్

-వ్యూహాత్మక బ్యూఫోర్ట్ కోట స్వాధీనం..



**నబటియహ్: మే 31( మహాప్రభ)**
ఇజ్రాయెల్ సైన్యం 26 ఏండ్ల తర్వాత లెబనాన్‌లోకి చొచ్చుకెళ్లింది. నబటియహ్ నగరం సమీపంలోని కీలకమైన బ్యూఫోర్ట్ కోటను స్వాధీనం చేసుకొన్నట్టు ఆదివారం తెలిపింది. కోటకు దగ్గర్లోని గ్రామాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసి హెజ్బొల్లా సభ్యులతో పోరాటం చేసిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. హెజ్బొల్లాతో జరుగుతున్న యుద్ధంలో ఇజ్రాయెల్‌కు ఇది కీలక విజయాన్ని అందించింది. కాల్పుల విరమణ నామమాత్రంగా అమలవుతున్న వేళ ఇజ్రాయెల్ సైన్యం బ్యూఫోర్ట్‌ను స్వాధీనం చేసుకుంది.

# మమతా బెనర్జీకి షాక్..

-పార్టీ సమావేశానికి
60 మంది ఎమ్మెల్యేల డుమ్మా



**న్యూఢిల్లీ మే 31( మహాప్రభ)**
మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి సొంత పార్టీ నేతలే షాకిచ్చారు. ఆమె నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలతో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఏకంగా 60 మంది ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. 20 మంది వరకు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఏకంగా ఈ సమావేశాన్ని రద్దు చేస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశం గురించి పార్టీ ఎమ్మెల్యేలకు ముందుగానే సమావేశం అందింది. టీఎంసీ లెజిస్లేటివ్ పార్టీ లీడర్ షోవన్‌దేవ్ ఛట్టోపాధ్యాయ్ అందరికీ సమావేశం గురించి చెప్పారు. కోల్‌కతాలోని, కాలిఘాట్‌లో ఉన్న పార్టీ అధినేత్రి మమత నివాసంలో, ఆమె ఆధ్వర్యంలోనే ఆదివారం సమావేశం ఉంటుందని ఆయన అందరికీ చెప్పారు. 80 మంది ఎమ్మెల్యేలకు సమాచారం అందిస్తే.. 20 మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. ఈ రోజు హాజరైన వారితో మమత కొద్దిసేపు మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై టీఎంసీ స్పందించింది. అభిషేక్ బెనర్జీపై శనివారం, కల్యాణ్ బెనర్జీపై ఆదివారం దాడి జరిగిన నేపథ్యంలో, తమ నేతలపై వరుసగా జరుగుతున్న దాడులకు భయపడి ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి రాలేదని పార్టీ అగ్రనాయకత్వం తెలిపింది. దీనంతటికీ కారణం బీజేపీనే అని విమర్శించింది. అయితే, నిజంగానే ఎమ్మెల్యేలు దాడులకు భయపడి రాలేదా.. లేదా పార్టీ అధినాయకత్వంపై ఆగ్రహంతో ఉన్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. టీఎంసీ నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. కొందరు తమ పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నారు. దీంతో టీఎంసీలో ఎంతమంది నేతలు కొనసాగుతారనేది అనుమానాస్పదమే. మరోవైపు బీజేపీ చేస్తున్న దాడులకు నిరసనగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ నేతలు ఆందోళన నిర్వహించనున్నారు. మమతా బెనర్జీ కూడా ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# వియత్నాంకు బ్రహ్మోస్ మిస్సైళ్లు..

ఒప్పందంపై ఇరుదేశాల సంతకాలు




**న్యూఢిల్లీ మే 31( మహాప్రభ)**
రక్షణరంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి 'బ్రహ్మోస్' ను వియత్నాం కు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియా తో కూడా తుది దశలో ఉందని భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ ( చెప్పారు. సింగపూర్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక షాంగ్రీ-లా డైలాగ్ భద్రతా సదస్సులో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పందం ఇప్పటికే పూర్తయింది. బహుశా బహిరంగంగా ప్రకటించనప్పటికీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇండోనేషియాతో చర్చలు కూడా తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే ఒప్పందం ఖరారు కావచ్చు' అని రాజేష్ కుమార్ సింగ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. వియత్నాంతో కుదిరిన ఒప్పందం విలువ సుమారు రూ.5,800 కోట్లు ఉన్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా తీరప్రాంత రక్షణ క్షిపణి వ్యవస్థలు, తొలి విడత క్షిపణులు, శిక్షణ, ఇతర సాంకేతిక సహకారం అందించనున్నారు. భవిష్యత్తులో వియత్నాం.. గగనతలం నుంచి ప్రయోగించే బ్రహ్మోస్ క్షిపణులను కూడా కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ సుమారు 375 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందంతో బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసింది. దాంతో భారత్ నుంచి బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసిన తొలి విదేశంగా ఫిలిప్పైన్స్ నిలిచింది. ఇప్పుడు వియత్నాం, త్వరలో ఇండోనేషియా కూడా ఈ జాబితాలో చేరనున్నాయి. దక్షిణ చైనా సముద్రంలో చైనాతో తీవ్రమైన ప్రాదేశిక వివాదాలు ఎదుర్కొంటున్న వియత్నాం, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు తమ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకుంటున్న తరుణంలో ఈ ఒప్పందాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ధ్వని కన్నా మూడు రెట్ల వేగంతో (మాక్ 3) ప్రయాణించే బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గాలి, సముద్రం నుంచి ప్రయోగించవచ్చు. దీని వేగం, కచ్చితత్వం కారణంగా శత్రువుల యుద్ధ నౌకలను, కీలక సైనిక స్థావరాలను వేగంగా ఛేదించగలదు. 2020 గల్వాన్ ఘర్షణల తర్వాత చైనాతో సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో తన వ్యూహాత్మక ప్రభావాన్ని పెంచుకోవాలని భారత్ భావిస్తోంది. రక్షణ ఎగుమతులను 2030 నాటికి రూ.50,000 కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మలేషియా, థాయ్‌లాండ్ వంటి ఇతర ఆగ్నేయాసియా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నట్ తెలుస్తోంది.

# నూతన సిడిఎస్ గా జనరల్ రాజా సుబ్రమణ

**న్యూఢిల్లీ మే 31( మహాప్రభ)**
జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి ఆదివారం భారతదేశ మూడవ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్), సైనిక వ్యవహారాల విభాగం కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే, జనరల్ సుబ్రమణి




న్యూఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ వద్ద అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం సౌత్ బ్లాక్‌లో ఆయనకు త్రి-సర్వీసెస్ గార్డ్ ఆఫ్ ఆనర్ లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కొత్త సిడిఎస్ సాయుధ దళాలపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. "చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరించడం నాకు గౌరవం. సాయుధ దళాలపై దేశం ఉంచిన నమ్మకానికి మేము కృతజ్ఞులం. భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, రక్షణ మంత్రిత్వ శాఖ, వ్యూహాత్మక సంస్థలు అన్ని భారతదేశ భద్రతను బలోపేతం చేయడానికి 'హోల్ ఆఫ్ నేషన్' విధానంలో భాగంగా ఐక్యంగా నిలుస్తాయి" అని ఆయన అన్నారు.

# జేఈఈ అడ్వాన్స్డ్ 2026 ఫలితాలు విడుదల..

- టాపర్‌గా శుభం కుమార్.. 56 వేల మంది అర్హత


**న్యూఢిల్లీ మే 31( మహాప్రభ)**
విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న జేఈఈ (జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్) అడ్వాన్స్డ్ 2026 ఫలితాలు విడుదలయ్యాయి. ఆదివారం రాత్రి 11.00 గంటల తర్వాత ఫలితాలు



వెల్లడయ్యాయి. ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన శుభం కుమార్ ఈ ఏడాది టాపర్‌గా నిలిచాడు. అతడు 360 మార్కులకుగాను 330 మార్కులు సాధించాడు. ఆ తర్వాత 329 మార్కులతో కబీర్ చిల్లార్ రెండో స్థానంలో, 319 మార్కులతో జతిన్ చాహర్ మూడో స్థానంలో నిలిచారు. అమ్మాయిల్లో ఆరోహి దేశ్‌పాండే టాపర్‌గా నిలిచారు. ఆమె 280 మార్కులు సాధించారు. ఈ ఏడాది జేఈఈలో పేపర్ 1, పేపర్ 2 పరీక్షలకు మొత్తం 1,79,694 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 56,880 మంది అర్హత సాధించారు. ఇందులో 10,107 మంది మహిళా విద్యార్థులు ఉన్నారు. అభ్యర్థులు ఫలితాల్ని యవమ్ఘుఞఒ.ఖుఒ.అఅ లో లాగిన్ అయ్యి తెలుసుకోవచ్చు. అప్లికేషన్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, మొబైల్ నెంబర్ వంటి వివరాలు ఎంటర్ చేసి స్కోర్ బోర్డుకు సంబంధించిన పీడీఎఫ్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జేఈఈ ద్వారా దేశంలోనే ఉన్నత విద్యాసంస్థలైన ఐఐటీలలో ప్రవేశం లభిస్తుంది.

# కేరళకు ఎల్లో అలర్ట్

**తిరువనంతపురం న్యూఢిల్లీ మే 31( మహాప్రభ)**
రాబోయే ఐదు రోజుల పాటు కేరళ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. భారీ వర్షపాతం కురిసే అవకాశం ఉన్నందున, ఆదివారం నాడు ఆరు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి, కోజికోడ్, వాయనాడ్ , కన్నూర్ ఉన్నాయి. ఈ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 24 గంటల వ్యవధిలో 64.5 మి.మీ నుండి 115.5 మి.మీ మధ్య వర్షపాతం నమోదైతే, దానిని ఐఎండీ "అక్కడక్కడ భారీ వర్షపాతం" (ఐఎస్ఓఎల్ హెచ్ )గా వర్గీకరిస్తుంది. ఈ వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు కూడా సంభవించవచ్చని భావిస్తున్నారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం, మట్టి చరియలు జారే అవకాశం ఉన్నది. అలాగే ఆకస్మిక వరదలు సంభవించే



ప్రాంతాల్లో నివసించే ప్రజలు, అధికారిక ఆదేశాలకు అనుగుణంగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు. నదీ తీరాల్లో , ఆనకట్టల దిగువ ప్రాంతాల్లో నివసించే వారు కూడా ముందు జాగ్రత్త చర్యగా అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సలహా ఇచ్చారు. రాబోయే మూడు గంటల వ్యవధిలో తిరువనంతపురం, కొల్లం, అలప్పుజ, కొట్టాయం, ఎర్నాకులం, త్రిశూర్, మలప్పురం, కోజికోడ్, కన్నూర్ , కాసరగోడ్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, వీటితో పాటు ఉరుములు, మెరుపులు , గంటకు 40 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. కేరళ , లక్షద్వీప్ తీరాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, గంటకు 35 నుంచి 45 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, కొన్ని సమయాల్లో ఈ గాలుల వేగం గంటకు 55 కి.మీ వరకు కూడా చేరవచ్చని అంచనా వేస్తున్నారు.

# టైటిల్ ఆర్సీబీదే

హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలిచింది. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (75 నాటౌట్; 42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకంతో జట్టును ముందుండి నడిపించి విజయతీరాలకు చేర్చాడు. 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు విరాట్ కోహ్లీ, వెంకటేశ్ అయ్యర్ (32; 16 బంతుల్లో) అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. పవర్‌ప్లేలో వీరిద్దరూ కేవలం 4.3 ఓవర్లలోనే 62 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయి కాస్త తడబడినప్పటికీ, ఒకవైపు విరాట్ కోహ్లీ క్రీజులో పాతుకుపోయి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. టిమ్ డేవిడ్ (24) కీలక సమయంలో రాణించాడు. చివరి వరకు క్రీజులో నిలిచిన కోహ్లీ, 18వ ఓవర్‌లో అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో సిక్సర్ బాది జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఇంకా 12 బంతులు






మిగిలి ఉండగానే ఆర్సీబీ లక్ష్యాన్ని ఛేదించింది. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ, కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్‌ను సాధారణ స్కోరుకే పరిమితం చేసింది. గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్; 37 బంతుల్లో) ఒంటరి పోరాటం చేసి అర్ధశతకంతో ఆదుకున్నాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ 3 వికెట్లతో సత్తా చాటగా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో ఆర్సీబీ, ఆ జట్టు కెప్టెన్ రజత్ పటీదార్ అరుదైన ఘనత సొంతం చేసుకోవడం విశేషం. ఆర్సీబీ ఈ విజయంతో... వరుసగా రెండు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల సరసన చేరింది. కెప్టెన్ గానూ రజత్ పటీదార్ వరుసగా రెండు టైటిళ్లతో రికార్డు పుటల్లోకెక్కాడు.

# అమెరికాతో రాజీ పడే ప్రసక్తే లేదు

మొదటి తరువాయి

లేదా శత్రుత్వానికి ముగింపుగా భావిస్తారా అనేది తెలియడం లేదు. ఎంఓయూను కేవలం ఒకే పేజీలో పొందుపరిచారు. దీనిలో దాదాపు డజను అంశాలు మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ అది అంత తేలికగా తేలే విషయంగా కన్పించడం లేదు.

ట్రంప్ తాజా డిమాండ్లతో పరిస్థితి జటిలం

'వారు ఏయే అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నారో, తొలి దశలో ఏ మేరకు రాయితీలు ఇవ్వడానికి సుము ఖంగా ఉన్నారో స్పష్టంగా తెలియాల్సి ఉంది. అప్పుడే దౌత్య పరిష్కారం సాధ్యపడుతుంది' అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఇటీవల చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణను దీర్ఘకాలిక పరిష్కారంగా మార్చే విష యంపై ఇరుపక్షాలు తాత్కాలికంగా ఒప్పందానికి వచ్చాయని అమెరికా అధికారులు తెలిపారు. అయితే రెండు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక డిమాండ్లను తెర పైకి తీసుకురావడంతో పరిస్థితి జటిలంగా మారింది. హార్ముజ్ జలసంధిని తెరవాలని, ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలని ఆయన కోరుతున్నారు. దీనికి ఇరాన్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విదేశాలలో స్తంభింపజే సిన తన ఆస్తులను తక్షణమే విడుదల చేయాలని ఇరాన్ పట్టుబడుతుండగా ట్రంప్ దానిపై పెదవి విప్పడం లేదు. అమెరికా డిమాండ్లు వాస్తవానికి అభ్యర్థనలేనని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై వ్యాఖ్యానించారు. ఏదేమైనా ఎంఓయూపై చర్చలు మాత్రం ఇంకా పురోగతిలోనే ఉన్నాయని తెలుస్తోంది.

హార్ముజ్‌పై...

హార్ముజ్ జలసంధిలో మూడు నెలలుగా వాణిజ్య నౌకల రాకపోకలు స్తంభించిపోవడంతో ముడి చమురు, నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ముందుగా నౌకాయానంపై ఒప్పందానికి రావాలని ఇరు పక్షాలు భావిస్తున్నాయి. జలసంధిని వెంటనే తెరవాలని, ఎలాంటి సుంకాలు-నియంత్రణలు లేకుండా నౌకాయానాన్ని అనుమతించాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. జలసంధిలో అమర్చిన మందుపాతరలను తొలగించాల్సిన బాధ్యత ఇరాన్‌దేనని కూడా ఆయన అంటున్నారు. అదే సమయంలో ఇరాన్ ఓడరేవుల దిగ్బంధాన్ని ఎత్తివేస్తామని చెప్పారు. అయితే ఒమన్‌తో కలిసి అంతర్జాతీయ జలమార్గం మీదుగా నౌకల రాకపోకలను పర్యవేక్షించే హక్కు తనకు ఉన్నదని ఇరాన్ అంటోంది. హార్ముజ్‌లో ఒమన్ ప్రమేయాన్ని వ్యతిరేకించడంతో పాటు దానికి ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారు. హార్ముజ్‌లో ఇరాన్ నియంత్రణలు, ఏర్పాట్లు స్వభావరీత్యా శాశ్వతమైనవవి, అవి తాత్కాలికమైనవేమీ కావని పార్లమెంటుకు చెందిన జాతీయ భద్రతా కమిషన్ అధిపతి ఇబ్రహీం అజిజి స్పష్టం చేశారు.

# భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం

మొదటి తరువాయి

అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పుడు కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా పేద కుటుంబాల జీవితాలను మార్చేస్తున్న సామాజిక ఉద్యమంగా మారిందని అన్నారు. స్వతంత్ర భారత చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సలహాలు సూచనల మేరకు భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టి తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేశామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నేడు జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా కరమెర మండలం కోశారి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండవ విడతకు శ్రీకారం చుట్టబోతున్నామని ప్రకటించారు. అలాగే కొత్తగూడెంలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్ల మంజూరుతో రెండు విడతల్లో కలిపి ఒక్కో నియోజకవర్గానికి 5500 నుంచి 6,500 ఇళ్లను మంజూరు చేసినట్టు అవుతుందన్నారు. ఐటిడిఎ ప్రాంతాల్లోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 1500 వరకు మంజూరు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. తాము ఆశించిన స్థాయిలో మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం విజయవంతమైందని గత ఏడాది ఫిబ్రవరి మూడవ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారని, ఈ 13 నెలల్లో లక్ష ఇళ్లను పూర్తి చేసుకొని మరో ఒకటి రెండు నెలల్లో మరో రెండు లక్షల ఇళ్లు పూర్తికాబోతున్నాయని తెలిపారు. ఇది పక్కాగా చూసినా దేశానికే ఆదర్శవంతంగా ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ ఏడాది 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను క్యూఆర్ పరిధిలో లక్ష ఇళ్లకు రాష్ట్రం లోని ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల మొత్తం 3.50 లక్షల ఇళ్లకు మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఒక ప్రణాళిక బద్ధంగా మొదటి విడతలో ఎదురైన మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని మరింత పటిష్టంగా రెండో విడత కార్యక్రమాన్ని అమలు చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. దేశంలోని చాల రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పరిమిత నిధులతో గృహ నిర్మాణాలను కొనసాగిస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం పేదవాడి ఇల్లు -- ప్రభుత్వ బాధ్యత అనే లక్ష్యంతో స్వంత నిధులతో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం కేవలం రూ.72 వేలే, పట్టణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు మాత్రమే ఇస్తున్నా, తెలంగాణ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి 2013 వరకు అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరై, ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి, 2023 లో గృహ లక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరై ఇప్పటికీ పూర్తి చేసుకోలేకపోయిన వారికి రెండవ విడతలో ఆ ఇంటి నిర్మాణం పూర్తి అవడానికి అవసరమయ్యే ఆర్థికసాయాన్ని అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అనాది కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన ఇందిరమ్మ పథకంలో 20వేల రూపాయల వరకు ఆర్థికసాయం పొందినవారికి కూడా ఈ విడతలో ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

# సంక్షేమంలో సింగరేణి సరికొత్త అధ్యాయం

**- కార్మిక కుటుంబాలకు రక్షణ కవచం కోటి రూపాయల ప్రమాద బీమా**
**- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో అమలైన పథకంతో 45 కుటుంబాల్లో వెలుగు**
**-దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ చర్య-నేడు దేశ వ్యాప్తంగా విస్తరణ**
**-సింగరేణిలో ఇప్పటికే సుమారు 41 కోట్ల రూపాయల బీమా సొమ్ము చెల్లింపు**

తెలంగాణ బ్యూరో ప్రతినిధి

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నాగుల రాజయ్య. ఆయన ఒక కొడుకు, ఒక కుమార్తె. సింగరేణిలో కార్మికుడిగా నియమకం ద్వారా ఆయన కుమారుడు సంతోష్ ఉద్యోగంలో చేరాడు. కానీ రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు సంతోష్‌ను కబళించింది. ఆయన సింగరేణిలో చేరి కూడా కేవలం 18 నెలలు మాత్రమే. తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న రాజయ్య కుటుంబానికి ఆయన కుమారుడు సంతోష్ ఏకైక దిక్కు. సంతోష్ పనిచేసిన 18 నెలల సర్వీసుకు వచ్చే టెర్మినల్ బెనిఫిట్స్ కూడా చాలా తక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్న రాజయ్య కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణిలో ప్రారంభించిన రూ.కోటి ప్రమాద బీమా పథకమే ఓ పెద్దకొడుకు ఆదుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న రాజయ్య వృద్ధ దంపతులకు ప్రస్తుతం ఆర్థికభరోసాగా మారింది. ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పెండ్లి లత. ఈమె భర్త రంజిత్ కుమార్. సింగరేణిలో పనిచేసేవాడు. పుట్టిన నెల రోజుల కొడుకును చూసి రావడానికి వెళ్లి వస్తూ ఆయన ప్రమాదవశాత్తు



మరణించాడు. ఆయనకు తండ్రి కూడా లేడు. దీంతో ఆయనపైన ఆధారపడిన భార్య లత, తల్లి, నెల రోజుల కుమారుడు ఒంటరివయ్యారు. అయితే ఆయనకు సింగరేణిలో ఒప్పందం ఉన్న బ్యాంక్ లో శాలరీ ఖాతా ఉండటంతో వారికి కోటి రూపాయలు బ్యాంకు నుంచి వచ్చాయి.. ఈ చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖామాత్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు స్వయంగా అందజేశారు. దూరమైన తన భర్తను తిరిగి తీసుకురాలేపోయినా... ఆయన నెరవేర్చే బాధ్యతను ఈ సొమ్ము ద్వారా తీర్చగలిగే అవకాశం కలిగిందని, తనకు, తన కుమారుడి భవిష్యత్తు ఇది ఎంతో దోహదపడుతుందని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తనకు కూడా అమ్మానాన్న లేరని, ఈ పథకం లేకపోతే తమ కుటుంబం, కుమారుడి భవిష్యత్తు అంధకారమయ్యేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రెండు కుటుంబాల విషయమే కాదు. గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణి లో ప్రవేశపెట్టిన ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా ఆర్థిక భరోసాను పొందిన 40 మందికి పైగా కుటుంబాల మనోగతం. ఇప్పుడు ఇది సింగరేణిలోనే కాదు దేశ వ్యాప్తంగా లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ చర్య. ప్రమాదాల వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా కుంగిపోయి ఛిన్నాభిన్నం అయ్యే పరిస్థితుల్లో చిక్కుకున్న జీవితాలకు భరోసాగా నిలుస్తోంది. ఉచిత ప్రమాద బీమా పథకం. రూపాయి ప్రీమియం చెల్లించకుండానే ఉద్యోగులకు, పొరుగు సేవల సిబ్బందికి సింగరేణిలో అమలవుతున్న ప్రమాద బీమా పథకం పై ప్రత్యేక కథనం. కార్మిక సంక్షేమానికి పెద్ద పీట వేయాలి అన్న రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి యాజమాన్యం దేశంలో తొలిసారిగా 1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమా పథకాన్ని సింగరేణి సంస్థలో అమలు చేసింది. 2024లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుల చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పథకం ఇప్పుడు దేశవ్యాప్తంగా బీమా రంగంలో ఒక విశ్వవ్యాప్త చర్చగా మారింది. బొగ్గు కంపెనీలతో పాటు, ఇతర సంస్థలు కూడా ఈ ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడానికి సింగరేణి సంస్థ స్ఫూర్తిగా నిలిచింది.

# ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో రేవంత్ భేటీ



మొదటి తరువాయి

ఎస్ఐఆర్ ను తెలంగాణలో ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాల పురోగతిని, బడ్జెట్ ప్రతిపాదనలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఖర్గేకు వివరించారు. రాష్ట్రంలో పార్టీ క్యాడర్ ను బలోపేతం చేయడం, ప్రభుత్వ పార్టీ సమన్వయాన్ని మరింత పటిష్టం చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే కేబినెట్ విస్తరణ, కొందరు మంత్రుల మార్పు, పోర్ట్ ఫోలియోల మార్పు విషయాలపై చర్చలు జరుగుతున్నాయి. ఈ వారంలోనే రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తో కూడా ఈ అంశంపై చర్చించి.. జూన్ రెండోవారంలో కేబినెట్ విస్తరణ చేపడతారని తెలుస్తోంది.

# ఆర్టీసీని బలోపేతం చేస్తాం

మొదటి తరువాయి

వాటిని వేగవంతం చేసి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు కనెక్టివిటీని మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు ప్రక్రియ కూడా కొనసాగుతోందని, ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్మికులకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో ఐదుగురు మంత్రులు, సీనియర్ అధికారులు, 40 మంది ఆర్టీసీ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికులకు 11 శాతం పీఆర్సీ మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నామని, ఎన్నికైన ప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో ఆర్టీసీ విలీన ప్రక్రియను చేపడతామన్నట్లు స్పష్టం చేశారు. విలీన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు, అడ్డంకులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, కార్మికులు అనవసర ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మరో పది రోజుల్లో తెలంగాణకు

# నైరుతి రుతుపవనాలు!

మొదటి తరువాయి

రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎండల తీవ్రత తగ్గి, వర్షాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం కేరళ, దాని పరిసర ప్రాంతాల్లో విస్తరించిన నైరుతి రుతుపవనాలు రానున్న నాలుగైదు రోజుల్లో తమిళనాడులోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతం కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనాల కారణంగా రుతుపవనాలు వేగంగా ముందుకు కదులుతున్నాయని అధికారులు తెలిపారు. లక్షద్వీప్, కొమోరిన్ ప్రాంతం నుంచి ఈశాన్య బంగాళాఖాతం వరకు రుతుపవనాలు ఇప్పటికే విస్తరించాయి. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాలులు క్రమంగా తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా దేహగాన్ లో రికార్డు స్థాయిలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ, రానున్న రోజుల్లో ఉపశమనం లభించనుంది. జూన్ 1 నుంచి హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు 36-38 డిగ్రీలకు, ఇతర జిల్లాల్లో 40-42 డిగ్రీలకు తగ్గుతాయని అంచనా. జూన్ 5 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు 38-39 డిగ్రీల మధ్య స్థిరపడనున్నాయి. కాగా, ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

# నేడు కుమ్రం భీం -ఆసిఫాబాద్ జిల్లాకు సీఎం


మొదటి తరువాయి

ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.56.55 కోట్లు. రెబ్బెన మండలం నాంబాల్ గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ ప్లాంట్ పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా చింతలమానేపల్లి, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల పనులకు కూడా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఉపకేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుంది. జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో చేపట్టనున్న తొమ్మిది అభివృద్ధి పనులు, కాగజ్ నగర్ మున్సిపాలిటీలో రూ.18.70 కోట్లతో చేపట్టనున్న ఎనిమిది అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ, పునరుత్పాదక ఇంధన వినియోగ ప్రోత్సాహం, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు.

# రైతులను ఆదుకోవాలి

మొదటి తరువాయి

సుప్రీంకోర్టు వరకు వెళ్తామని స్పష్టం చేశారు. కేంద్రం తెచ్చిన కొత్త సోలార్ జీవో.. బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటన దారుణమన్నారు. సీఎం, ఖమ్మం జిల్లా మంత్రులు బాధ్యత వహించి ఆ చిన్నారి పేరిట రూ.25 లక్షలు ఫిక్స్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. దసరా నాటికి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును ప్రతిపాదించకపోతే పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు.



# సంపాదకీయం

## జెన్ -- జీ గళం వినిపిస్తోందా?




భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువజన జనాభా కలిగిన దేశమని పాలకులు గర్వంగా చెబుతుంటారు. " యువతే దేశానికి వెన్నెముక ", "యువశక్తి దేశ భవిష్యత్తు", వంటి పదాలను వేదికలపై పదేపదే వినిపిస్తుంటారు. కానీ అదే యువత ఈ రోజు ఉద్యోగాల కోసం వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? విద్య పూర్తిచేసి సంవత్సరాలు గడిచినా ఉద్యోగం దొరకక నిరాశలో మగ్గుతున్న యువకులు ఎందుకు పెరుగుతున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. ప్రస్తుతం దేశంలో జెన్-జీ గా పిలవ బడుతున్న యువతరం రాజకీయంగా, సామాజి కంగా గత తరాల కంటే ఎక్కువ అవగాహన కలిగి ఉంది. సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచ పరిణామాలను గమనిస్తున్న ఈ తరం కేవలం నినాదాలతో సంతృప్తి చెందడం లేదు. వారికి ఉద్యోగాలు కావాలి, నాణ్యమైన విద్య కావాలి, సమాన అవకాశాలు కావాలి, జీవన భద్రత కావాలి. కానీ పాలకుల నుంచి వినిపిస్తున్నది మాత్రం భారీ హామీలు, ప్రచార ఆర్భాటాలు, ఎన్నికల వాగ్దానాలే. గత కొన్నేళ్లుగా నిరుద్యోగం భారత యువతను వేధిస్తున్న ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వ రంగ ఉద్యోగాల భర్తీలు తగ్గడం, ఖాళీలు ఉన్నా నియామకాలు జరగకపోవడం, పరీక్షల నిర్వహణలో జాప్యం, ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామక ప్రక్రియలలో పారదర్శకత లోపించడం వంటి అంశాలు యువతలో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నాయి. లక్షల మంది అభ్యర్థులు ఒక ఉద్యోగానికి పోటీ పడుతున్న దృశ్యాలు దేశ అభివృద్ధి కథనానికి విరుద్ధమైన వాస్తవాన్ని చూపుతున్నాయి. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా జరిగిన యువజన నిరసనలు ఈ అసంతృప్తికి ప్రతిబింబం. రైల్వే ఉద్యోగాలు, సైనిక నియామకాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు వంటి అంశాలపై యువత వీధుల్లోకి రావడం యాదృచ్ఛికం కాదు. ఇది అవకాశాలు కోల్పోతున్న ఒక తరం వ్యక్తం చేస్తున్న ఆవేదన. కానీ ఈ నిరసనలను వినాల్సిన పాలకులు వాటిని రాజకీయ కోణంలో చూడడం, ప్రశ్నించే యువతను విమర్శించడం ఆందోళనకర పరిణామం. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములుగా చూడాల్సిన ప్రభుత్వం, వారిని కేవలం ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా మాత్రమే చూడడం ప్రమాదకరం. ఉద్యోగాల గురించి ప్రశ్నిస్తే దేశభక్తి పాఠాలు చెప్పడం, జీవనోపాధి గురించి అడిగితే అభివృద్ధి గణాంకాలు చూపించడం సమస్యలకు పరిష్కారం కాదు. ఆకలి, నిరుద్యోగం, అసమా నతలు గణాంకాలతో తగ్గవు. వాటికి అవసరమైనది సమర్థమైన విధానాలు. ఇటీవలి రాజకీయ పరిణామాలు కూడా యువతలో అనేక ప్రశ్నలను లేవనెత్తుతు న్నాయి. పాలకుల విధానాలపై అసంతృప్తికి తాజా ప్రతీకగా నిలిచింది "కాక్రోచ్ జనతా పార్టీ" (సిజెపి). మొదట ఇది ఒక వ్యంగ్య రాజకీయ- సామాజిక ఉద్యమంగా ప్రారంభ మైంది. నిరుద్యోగ యువతను "కాక్రోచ్‌లు", "పరాన్న జీవులు"గా అభివర్ణించారన్న ఆరోపణల నేపథ్యంలో సోషల్ మీడియాలో యువత ఆగ్రహం వ్యక్తమైంది. ఆ ఆగ్రహం క్రమంగా ఒక డిజిటల్ ఉద్యమంగా మారింది. వ్యంగ్య పోస్టులు, మీమ్స్, వీడియోలతో ప్రారంభమైన ఈ ప్రచారం కొన్ని రోజుల్లోనే కోట్లాది మంది యువతను ఆకర్షించింది. కాక్రోచ్ జనతా పార్టీ అసలు బలం దాని పేరులో కాదు, దాని వెనుక ఉన్న ఆవేదనలో ఉంది. ఉద్యోగాలు లేక, భవిష్యత్తుపై భరోసా లేక, ప్రభుత్వాల హామీలపై నమ్మకం కోల్పోతున్న ఒక తరం తన అసంతృప్తిని కొత్త భాషలో వ్యక్తం చేస్తోంది. ఇది కేవలం సోషల్ మీడియా ట్రెండ్ కాదు. యువత మనస్తత్వంలో జరుగుతున్న మార్పుకు సంకేతం. నేడు అవకాశవాద రాజకీయాలు, ప్రజా సమస్యల కంటే ప్రచార రాజకీయాలకు ప్రాధాన్యత పెరగడం, కార్పొరేట్ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం లభిస్తున్నదన్న విమర్శలు యువతలో విశ్వాస సంక్షోభాన్ని పెంచుతున్నాయి. రాజకీయ పార్టీలు యువతను ఆకర్షించడానికి సోషల్ మీడియా ప్రచారాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, ఉద్యోగాల కల్పనకు మాత్రం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. జెన్-జీ తరం కోరుకుంటున్నది చాలా స్పష్టమైనది. వారికి మత విద్వేషాలు అవసరం లేదు. కుల, మత రాజకీయాల కంటే ఉద్యోగ భద్రత ముఖ్యం. ద్వేష ప్రసంగాల కంటే మంచి విద్య ముఖ్యం. భారీ విగ్రహాలు, ఆర్భాట ప్రాజెక్టుల కంటే ఉపాధి అవకాశాలు ముఖ్యం. వారు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు సంపాదించ డానికి సిద్ధంగా ఉన్నారు. కానీ ఆ నైపుణ్యాలకు తగిన అవకాశాలు దేశంలోనే లభించాలనుకుంటున్నారు. నేడు అనేక మంది యువకులు విదేశాలకు వలస వెళ్లేందుకు ప్రయత్నించడం కూడా దేశీయ ఉపాధి పరిస్థితులపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇంజినీరింగ్, వైద్య, సాంకేతిక విద్యల్లో ప్రతిభ కనబరిచిన యువత దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి గర్వకారణం కాదు. ఇది దేశ విధానాల వైఫల్యానికి సంకేతం. యువత శక్తిని దేశాభివృద్ధికి వినియోగించలేకపోతే, అది సామాజిక అసంతృప్తికి దారితీస్తుంది. పాలకులు గుర్తుంచు కోవాల్సిన విషయం ఏమిటంటే, జెన్-జీ తరం మౌనంగా ఉండే తరం కాదు. ప్రశ్నించే తరం. సమాచారాన్ని పరిశీలించే తరం. వాస్తవాలను పోల్చిచూసే తరం. అందువల్ల ప్రచారాలతో మాత్రమే వారిని ప్రభావితం చేయడం సాధ్యం కాదు. ఉద్యోగాల కల్పన, ప్రభుత్వ రంగ నియామకాల వేగవంతం, విద్యావ్యవస్థ బలోపేతం, స్టార్టప్‌లకు మద్దతు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం వంటి చర్యల ద్వారానే యువత విశ్వాసాన్ని గెలుచుకోవచ్చు. భారత యువత ఈ రోజు అడుగుతున్నది -- "మాకు భవిష్యత్తు ఎక్కడ?" ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా దేశం అభివృద్ధి చెందుతోందని చెప్పడం సరిపోదు. యువత ఆగ్రహం, నిరాశ, అసంతృప్తి మరింత పెరిగితే అది కేవలం ఒక వర్గం సమస్యగా మిగలదు. అది దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం కాక్రోచ్ జనతా పార్టీ వాటిపై ఆగ్రహం వ్యక్తం చేయకుండా, ముందు జెన్ -- జీ ఆవేదనను అర్థం చేసుకోవాలి. లేదంటే పాలకుల మెడలు వంచే శక్తి యువతకే ఉంటుంది

# జూన్ 2న ఉద్యమకారుల ర్యాలీనీ విజయవంతం చేయాలని జేఏసీ పిలుపు

**హుస్నాబాద్, మే 31( మహాప్రభ)**

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీపై హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. కమిటీలో ఉద్యమ సంస్థల ముఖ్యులు, మేధావులను చేర్చాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేసింది. జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో-కన్వీనర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ, ఉద్యమకారులకు 250 గజాల స్థలాలు, 25 వేల పెన్షన్, ఉచిత విద్య, వైద్యం, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. ఈ డిమాండ్లతో జూన్ 2న ఉదయం 9 గంటలకు అంబేద్కర్ చౌరస్తా నుండి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మేకల వీరన్న యాదవ్, మడుప ప్రభాకర్ రెడ్డి, కోయడ కొమురయ్య, బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఐలెని మల్లికార్జునరెడ్డి, ఉప్పల వెంకటరమణా రెడ్డి, ఎడబోయిన తిరుపతి రెడ్డి, అన్వర్, గడిపే మల్లేష్, లావుడ్య కిషన్ నాయక్, ఇల్లందుల లక్ష్మణ్, భుక్య రమేశ్ నాయక్, పి. రాజ్ కుమార్, బండి పుష్ప, బత్తుల చంద్రమౌళి, మెతుకు కొమురయ్య, ఎం. ప్రభాకర్ రెడ్డి, ఎన్. అజయ్ కుమార్, చింతల రామచంద్రం, జె. యాదగిరి, వినీత్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం జూన్ 2 ర్యాలీని విజయవంతం చేయాలని జేఏసీ పిలుపునిచ్చింది.




# ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు డిమాండ్




**కరీంనగర్, మే 31( మహాప్రభ)**

ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ అధ్యక్షుడు పున్నం రవి డిమాండ్ చేశారు. కోతిరాంపూర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వాల్మార్ట్, డీమార్ట్, బ్యాంకులు, ఏటీఎంలు, షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్ వద్ద పనిచేస్తున్న గార్డ్స్‌ను రోజుకు 12--14 గంటలు పనిచేయించి కేవలం రూ.10,000--12,000 మాత్రమే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఫంక్షన్ హాల్స్‌లో తాత్కాలికంగా పనిచేసే గార్డ్స్‌కు రోజుకు 8 గంటల పనికి రూ.800 చెల్లించాలని తీర్మానం చేశారు. లైసెన్సు లేకుండా ఏజెన్సీలు నడుపుతున్న వాటిపై లేబర్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, గార్డ్స్‌కు యూనిఫాం, టోపీ, టార్చ్‌లైట్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎరుమడ్ల పరుశురాం, సుంకరపల్లి ప్రవీణ్, కోదాటి కనకయ్య, గౌరు శంకర్, ఎలబోతారం చరణ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. సెక్యూరిటీ గార్డ్స్ శ్రమను దోపిడీ చేస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని యూనియన్ డిమాండ్ చేసింది.

# టీబీ ముక్త్ భారత్ ఎక్స్‌రే శిబిరం

**తిమ్మాపూర్, మే 31( మహాప్రభ)**



రేణికుంట గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఉచిత ఛాతీ ఎక్స్‌రే స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎలుక ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 70 మంది గ్రామస్తులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం పట్ల సర్పంచ్ ఆంజనేయులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, వైద్యురాలు డాక్టర్ జవేరియా ఇమ్రోజ్, ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్తలు ఎలుక విజయలక్ష్మి, శ్వేత, కర్ర అరుణ, టీబీ సూపర్వైజర్ సదయ్య, టీబీ ముక్త్ భారత్ బృందం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణకు శిబిరం ఉపయోగకరంగా నిలిచింది.

# ఘనంగా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణా తరగతులు

**కరీంనగర్, మే 31( మహాప్రభ)**



కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్--2026 జిల్లాస్థాయి తరగతులు ఉత్సాహంగా జరిగాయి. ఈ శిక్షణా శిబిరంలో భాగంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసారమయ్యే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి--డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, శ్రేణులు సమిష్టిగా వీక్షించారు. ఉద్యమ ఉత్సాహంతో సాగిన శిక్షణా తరగతులు, 'మన్ కీ బాత్' కార్యక్రమం వీక్షణతో ప్రత్యేకత సంతరించుకున్నాయి.

# విజయవంతంగా ముగిసిన స్పోకెన్ ఇంగ్లీష్ సమ్మర్ క్యాంప్



**కరీంనగర్, మే 31( మహాప్రభ)**

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వినూత్న చొరవతో నిర్వహించిన 15 రోజుల స్పోకెన్ ఇంగ్లీష్ సమ్మర్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ ప్రత్యేక పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. పారామిత హెరిటేజ్ స్కూల్ డైరెక్టర్ హనుమంతరావు ప్రతిరోజూ తరగతులు నిర్వహించి, సంభాషణా వ్యాయామాలు, వర్క్‌షీట్లు, సరదా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. విద్యార్థులు మాట్లాడుతూ, ఇంగ్లీష్ మాట్లాడటంపై ఉన్న భయం తొలగిపోయిందని, ఇప్పుడు ధైర్యంగా మాట్లాడగలుగుతున్నామని తెలిపారు. క్యాంప్ ముగింపు సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఇంగ్లీష్‌పై ఆత్మవిశ్వాసం నింపిన ఈ క్యాంప్ ఆదర్శంగా నిలిచింది.

# ఘనంగా అహల్యబాయి 301వ జయంతి ఉత్సవాలు



**కరీంనగర్, మే 31( మహాప్రభ)**


కురుమ సంఘం ఆధ్వర్యంలో మహారాణి అహల్యబాయి హోల్కర్ 301వ జయంతి ఉత్సవాలు ఆదివారం జిల్లా కురుమ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న మాట్లాడుతూ, అహల్యబాయి సాధారణ గొర్రెల కాపరి కుటుంబంలో జన్మించి, 30 సంవత్సరాల పాటు ఇండోర్, మహేశ్వర్ రాజధానుల నుంచి పరిపాలన సాగించి ప్రజల సేవలో నిలిచారని తెలిపారు. ఆమె దేవాలయాల పునరుద్ధరణ, సత్రాల నిర్మాణం, నీటి వసతులు, రహదారుల అభివృద్ధి వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని, ప్రజలు ఆమెను దేవతగా పూజించారని పేర్కొన్నారు. అహల్యబాయి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిగుర్ల శ్రీనివాస్, ఈరల్ల విజయ్ కుమార్, సంద స్వప్న, ఉడిగా రాజశేఖర్, మేకల పర్శరామ్, పెద్ది మానస తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు. మహారాణి అహల్యబాయి సేవా కార్యక్రమాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని సంఘం నేతలు పేర్కొన్నారు.

## వ్యక్తిగత వేధింపులపై ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన గన్యానాయక్ తండ సర్పంచ్ నేనావత్ గోపాల్ నాయక్




**దేవరకొండ ( డివిజన్) 31మే (మహాప్రభ):**
స్థానిక నాయకులు చేస్తున్న వ్యక్తిగత, రాజకీయ వేధింపులపై గన్యానాయక్ తండ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీ నేనావత్ గోపాల్ నాయక్ ఆదివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన గళం విప్పారు. కేవలం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే తనపై, తన కుటుంబ సభ్యులపై కావాలనే అక్రమ కేసులు బనాయిస్తూ, వ్యక్తిగతంగా తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులు, వేధింపుల వ్యవహారంపై సర్పంచ్ నేనావత్ గోపాల్ నాయక్ ఆదివారం గౌరవనీయులైన ఎస్టీ కమిషన్ సభ్యులు శ్రీ జాటోత్ హుస్సేన్ నాయక్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కుటుంబానికి జరుగుతున్న అన్యాయాన్ని, తాము ఎదుర్కొంటున్న వ్యక్తిగత వేధింపులను కమిషన్ దృష్టికి తీసుకెళ్తూ పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా, అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతున్న వారిపై తక్షణమే విచారణ జరిపి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని కమిషన్ గారిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషన్ సభ్యులు, పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఆర్మీ జవాన్లు ఎంపికైన నేరల్ తాండ వీరుడు



**గాంధారి మే 31 (మహాప్రభ)**
గాంధారి మండలం నేరల్ తండాకు చెందిన ఆరుగురు యువకులు అగ్నివీర్లు జీడీగా ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. రాందాస్, అర్జున్, మహేందర్, జైపాల్, ఆకాష్, భీమ్లు అగ్నివీర్ నియామక ప్రక్రియలో విజయం సాధించి సైన్యంలో సేవ చేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఒకే తండా నుంచి ఆరుగురు యువకులు ఎంపిక కావడం విశేషంగా మారింది. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత వారిని అభినందించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## మండల పాత్రికేయుల సభ్యత్వం టియుడబ్ల్యూ జే (ఐజే యు) సభ్యత్వ నమోదు



**గాంధారి, మే 31 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా తెలంగాణ రాష్ట్ర యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్,(ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్) సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం గాంధారి మండలకేంద్రంలో చేపట్టారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పత్రికా విలేకరులకు జిల్లా సభ్యత్వన్ని జిల్లా నాయకులు అందజేశారు.. కామారెడ్డి జిల్లా మహాసభను జిల్లా కేంద్రంలో జూన్ 12 వ తేదీన నిర్వహిస్తునట్లు జిల్లా ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉ షబయ నాయకులు శ్రీనివాస్, అభిద్, చక్రధర్ మండల జర్నలిస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు...

## ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**గన్నేరువరం, మే 31 (మహాప్రభ)**
గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుల్లతో, బైండ్ల పూజలతో గ్రామమంతా పండగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంటి నుండి బోనం తీసి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా వారాల మల్లేశం మాట్లాడుతూ, వర్షాలు సమృద్ధిగా కురవాలని, ప్రజలందరినీ చల్లగా చూడాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామమంతా భక్తి, ఉత్సాహ వాతావరణంలో పోచమ్మ బోనాలు జరిగాయి.



# మినీ చెత్త డంపింగ్ యార్డ్‌గా మారిన జయశంకర్ కాలనీ, ఎన్టీఆర్ నగర్

**--దోమలు, ఈగల విజృంభణతో వ్యాధుల భయం**
**-- జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**

**కూకట్పల్లి , మే 31 (మహాప్రభ)**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ జయశంకర్ కాలనీ, ఎన్టీఆర్ నగర్ ప్రాంతాలు పారిశుధ్య సమస్యలతో సతమతమవుతున్నాయి. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, అధ్వానంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భరించలేని దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు విపరీతంగా పెరగడంతో అంటువ్యాధులు ప్రబలుతాయనే ఆందోళన స్థానికుల్లో నెలకొంది.
ఎన్టీఆర్ నగర్‌లోని మజీద్, బెతెల్ గాస్పల్ చర్చ్ సమీపంలోని బ్లాక్ నంబర్లు 136, 143 మధ్య ఉన్న ఖాళీ స్థలం చెత్తతో నిండిపోయి మినీ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. జీహెచ్ఎంసీ అధికారులు చెత్త కుండీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అదే ప్రాంతంలో చెత్త వేస్తుండటంతో పరిస్థితి మరింత దిగజారింది.



వర్షాకాలంలో చెత్త, మురుగునీరు పేరుకుపోవడం వల్ల దుర్వాసన మరింత పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళ దోమల బెడద ఎక్కువగా ఉండటంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని వాపోతున్నారు.
కాలనీలో చెత్త తొలగింపు, పారిశుధ్య నిర్వహణ కోసం పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త కుప్పల వద్ద కుక్కలు, పందులు, గేదెలు సంచరిస్తూ చెత్తను చెల్లాచెదురు చేయడంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది.
రహదారులపైకి కూడా చెత్త చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది నివాసితులు తమ ఇళ్ల చెత్తను ఖాళీ స్థలాల్లో వేయడం కూడా సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. జయశంకర్ కాలనీ, ఎన్టీఆర్ నగర్ వాసులు జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి చెత్తను పూర్తిగా తొలగించాలని, శాశ్వత పారిశుధ్య కార్మికులను నియమించి పరిశుభ్రతను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి కాలనీవాసులను వ్యాధుల ముప్పు నుంచి రక్షించాలని కోరుతున్నారు.

## నేరడుగోమ్ము మండలం 4ప్రాథమిక పాఠశాలలు మంజూరు

**-మండల విద్యాధికారి తాటికొండ బ్రహ్మాచారి**

**దేవరకొండ ( డివిజన్) 31మే (మహాప్రభ):**
నేరడుగోమ్ము మండలంలో 2026-27 విద్యా సంవత్సరం నుంచి నూతనముగా 4 పూర్వ ప్రాథమిక పాఠశాలలు మంజూరయ్యాయి, వీటిలో 1. చర్ల తండా. 2. నేరేడు గొమ్ము 3. తిమ్మాపురం. 4. పెద్దమునిగల్ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్వ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించబడతాయి. వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు సంఖ్య పెరగడానికి సహాయపడతాయని మండల విద్యాధికారి తాటికొండ బ్రహ్మాచారి తెలిపారు. అదేవిధంగా సంచాలకులు పాఠశాల విద్య తెలంగాణ హైదరాబాద్, జూమ్ సమావేశంలో జారీ చేసిన సూచనల మేరకు




మండలంలోని సమస్త పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించినది ఏమనగా తేదీ 1.6.2026 నుండి ఏ.ఏ.పీ.సి కింద ఏర్పాటుచేసిన సానిటరీ సిబ్బంది పాఠశాలలకు హాజరైనట్లు చర్యలు గైకొని పాఠశాల తరగతి గదులు, పరిసరాలు, ఆట స్థలము, టాయిలెట్స్, మంచినీటి ట్యాంకులు, నీటి గుంటలు శుభ్రం చేయించవలెను. చిన్న చిన్న రిపేర్లు ఏమైనా ఉంటే చేయించుకోవలెను పాఠశాల ఆవరణ శుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండేటట్లు ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాల్సిందిగా పై అధికారుల సూచనలు పాటించవలసిందిగా కోరుతున్నాము. గత సంవత్సరం జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలైన ధర్మ రేఖ్య తండా, మూల వాగు తండా, వైజాగ్ కాలనీ, బచ్చాపురం పాఠశాలలు పున:ప్రారంభించాలని, బడిబా ట కార్యక్రమంలో పైన పేర్కొన్న పాఠశాలల ఉపాధ్యాయులు ఆ ఆవాసములలో ప్రజాప్రతినిధులను కలిసి వారి సహకారంతో పాఠశాల పునః ప్రారంభం చేయాలని జిల్లా అధికారులు తెలియజేసినారు.

# ఘడియ గౌరారంలో 15వ ఫైనాన్స్ నిధులపై వివాదం

**-అక్రమ లేఅవుట్లకూ ప్రోత్సాహం ఇస్తున్నారంటూ ఆరోపణలు**
**-కలెక్టర్‌కు వార్డు సభ్యుల ఫిర్యాదు**

**చింతపల్లి, మే 31 (మహాప్రభ)**
చింతపల్లి మండలంలోని ఘడియ గౌరారం గ్రామపంచాయతీలో 15వ ఫైనాన్స్ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, గ్రామంలో అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపిస్తూ వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి కథనం ప్రకారం.. గ్రామ సర్పంచ్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తుండగా, సర్పంచ్ హేమలత భర్త నరేంద్రరావు గ్రామపంచాయతీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా, గ్రామపంచాయతీ తీర్మానాలు లేకుండానే పలు పనులు చేపడుతున్నారని ఆరోపించారు.



గ్రామపంచాయతీకి వచ్చిన 15వ ఫైనాన్స్ నిధుల్లో సుమారు రూ.1.59 లక్షలకు పైగా ఎలాంటి సరైన రికార్డులు లేకుండా డ్రా చేసినట్లు పేర్కొన్నారు. అలాగే పంచాయతీలో పనిచేసే సిబ్బందికి వారి ఖాతాల్లో జీతాలు జమ చేయకుండా, ఇతరుల పేర్లతో నిధులు ఉపసంహరించుకుంటున్నారని ఫిర్యాదులో తెలిపారు. పంచాయతీ సమావేశాల సమయంలో సర్పంచ్ భర్త కార్యాలయంలోకి వచ్చి వార్డు సభ్యులను అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడడం జరుగుతోందని ఆరోపించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 25, 26లో వ్యవసాయ భూముల్లో గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారని, వాటికి సర్పంచ్ భర్త ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై తక్షణమే ప్రత్యేక గ్రామపంచాయతీ సమావేశం ఏర్పాటు చేసి, 15వ ఫైనాన్స్ నిధుల వినియోగం, అక్రమ లేఅవుట్ల అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వార్డు సభ్యులు కోరారు.

## బడిబాట కార్యక్రమం విజయవంతం



**గంగాధర, మే 31 (మహాప్రభ)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని మల్లాపూర్, గోపాలరావుపల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమం ఘనంగా జరిగింది. సర్పంచ్ కొలేపాక కవిత ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల ప్రవేశాలు చేపట్టారు.
ప్రధానోపాధ్యాయులు సలువాజీ నాగేశ్వరరావు, హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎనుగు ప్రభాకర్ రావు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు విశేషంగా స్పందించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావడంతో బడిబాట కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి వివరించడంతో గ్రామాల్లో విద్యాపట్ల కొత్త చైతన్యం నెలకొంది.

## కెసిఆర్ ని కలిసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి...



**ఆమనగల్లు, మే 31 (మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం ముఖ్యంగా కల్వకుర్తి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. కల్వకుర్తి నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలు స్థానిక నాయకత్వం పనితీరు భవిష్యత్తు రాజకీయ వ్యూహాలపై కేసీఆర్ గోలి శ్రీనివాస్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, గ్రామస్థాయి నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాలను భారీ ఎత్తున చేపట్టాలని గోలి శ్రీనివాస్ రెడ్డిని కెసిఆర్ ఆదేశించారు.

# బిజినెస్

## బంగారం కొనాలనుకుంటున్నారా.. ధరలు ఎలా ఉన్నాయంటే

అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది. వివిధ దేశాల ఈక్విటీ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు ఆటుపోట్లకు గురవుతున్నప్పటికీ బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఆదివారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,57,040గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,43,950గా ఉంది. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,190గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,44,100గా ఉంది.


మరోవైపు వెండి ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి . ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,90,000గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,80,000గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,90,000గా, బెంగళూరులో రూ.2,80,000గా ఉంది.



**గమనిక:** బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి కొనుగోలు చేసే ముందు ఒకసారి ధరలను చెక్ చేసుకోవలసిందిగా సూచన.

## టయోటా సరికొత్త ఈవీ

### ప్రారంభ ధర రూ.23.60 లక్షలు..




**న్యూఢిల్లీ,**
ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం టయోటా..దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఈవీని తీసుకొచ్చింది. టయోటా ఎబెల్లా పేరుతో విడుదల చేసిన ఈ కారు ప్రారంభ ధర రూ.23.60 లక్షలుగా నిర్ణయించింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు 61 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 541 కిలోమీటర్లు ప్రయాణించనుండగా... 49 కిలోవాట్ల బ్యాటరీతో తీర్చిదిద్దిన కారు 344 కిలోమీటర్లు ప్రయాణించనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 10.1 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లేతోపాటు 10.25 ఇంచుల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, ఫిక్స్‌డ్ గ్లాస్ రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే/ఆండ్రాయిడ్ ఆటో, ఎయిర్ ప్యూరిఫైర్, ఆటో ఏసీ, భద్రత ప్రమాణాలు మెరుగుపర్చడంలో భాగంగా ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, అన్ని టైర్లు డిస్క్ బ్రేకింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.

## స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ఢమాల్!

### పెరిగిన ధరలతో 30 శాతం వరకు పడిపోయే అవకాశం



న్యూఢిల్లీ,
దేశవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ల విక్రయాలకు ధరల పెంపు సెగ గట్టిగానే తాకనున్నది. రూపాయి పతనంతో మొబైల్ తయారీ సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ధరలు పెంచిన సంస్థలకు అమ్మకాల రూపంలో షాక్ తగలబోతున్నది. వచ్చే పండుగ సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు 30 శాతం వరకు పడిపోయే ప్రమాదం ఉన్నదని నివేదిక వెల్లడించింది. జూలై నుంచి డిసెంబర్ మధ్యకాలంలో ధరలు మరోసారి పెరిగితే వార్షికంగా స్మార్ట్‌ఫోన్ సేల్స్ భారీగా పడిపోనున్నాయని త్రైకిన్ టెక్నాలజీ, టెకేర్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించాయి. దేశవ్యాప్తంగా 6 వేల మంది యాక్టివ్ మొబైల్ కొనుగోలుదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది.ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 48 మంది వచ్చే ఆరు నెలల్లో ఫోన్ కొనుగోలు నిర్ణయాన్ని వాయిదావేసుకుంటున్నట్టు చెప్పారు. కానీ, ఆరు శాతం మంది తమ వద్ద ఉన్న ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ ఇచ్చి ఇతర స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉన్నదన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు భవిష్యత్తులోనూ కొనసాగితే వచ్చే ఆరు నెలల్లో స్మార్ట్‌ఫోన్ల డిమాండ్ 11-12 కోట్లకు పడిపోనున్నట్టు తెలిపింది. రూ.20 వేల లోపు ధర కలిగిన స్మార్ట్‌ఫోన్ల ధరలు సరాసరిగా 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగాయి. ధరల పెరుగుదలే అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని టెకేర్ ఫౌండర్ ఫైజల్ కవూసా తెలిపారు. గడిచిన ఏడాదికాలంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఐదు శాతం పడిపోయింది. సర్వేలో పాల్గొన్న వారిలో ఆరు శాతం మంది సెకండ్ హ్యాండ్ మొబైళ్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు.


# స్పోర్ట్స్

## నాడు ఔట్.. నేడు నాటౌట్.. ఫైనల్ మ్యాచ్‌లో వివాదాస్పద క్యాచ్..

### -- అంపైర్ నిర్ణయంతో మైదానంలో హైడ్రామా!

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య జరుగుతున్న మహా సంగ్రామంలో ఊహించని వివాదం రేగింది. వాషింగ్టన్ సుందర్ అవుట్ చుట్టూ తిరిగిన ఒక హైడ్రామా మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. థర్డ్ అంపైర్ ఇచ్చిన వివాదాస్పద నిర్ణయం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో క్రికెట్ అభిమానుల మధ్య పెద్ద చర్చకు దారితీసింది.

ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ అంటేనే నరాలు తెగే ఉత్కంఠ. అలాంటి ఈ కీలక పోరులో గుజరాత్ బ్యాటర్లను దెబ్బకొట్టేందుకు బెంగళూరు జట్టు పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. ముఖ్యంగా షార్ట్ పిచ్ బంతులతో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టాలనే బెంగళూరు ప్రణాళిక అద్భుతంగా పాలుపంచుతోంది. ఇదే క్రమంలో జేకబ్ డఫీ వేసిన ఇన్నింగ్స్ పదో ఓవర్ ఆఖరి బంతికి ఒక పెద్ద నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. డఫీ లెగ్ స్టంప్ వైపు వేగంగా విసిరిన షార్ట్ పిచ్ బంతిని, గుజరాత్ బ్యాటర్ వాషింగ్టన్ సుందర్ ఫైన్ లెగ్ మీదుగా సిక్సర్ బాదాలని ప్రయత్నించాడు. కానీ అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న జోర్డాన్ కాక్స్ గాల్లోకి దూకుతూ అద్భుతమైన డైవ్‌తో ఆ




క్యాచ్‌ను అందుకున్నాడు.ర్డాన్ కాక్స్ క్యాచ్ పట్టగానే బెంగళూరు ఆటగాళ్లు ఆనందంతో గాల్లోకి లేచారు. వికెట్ పడిపోయిందనే సంబరాల్లో మునిగిపోయారు. అయితే క్షేత్రస్థాయిలో ఉన్న అంపైర్ నితిన్ మీనన్‌కు క్యాచ్‌పై కొంత అనుమానం రావడంతో, బ్యాటర్ వాషింగ్టన్ సుందర్‌ను మైదానం వీడకుండా అక్కడే వేచి ఉండమని కోరారు. వెంటనే ఈ నిర్ణయాన్ని థర్డ్ అంపైర్ జయరామన్ మదనగోపాల్‌కు బదిలీ చేశారు. పెద్ద తెరపై పునరావృత దృశ్యాలను (రీప్లే) పరిశీలించినప్పుడు అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కాక్స్ చేతుల్లో బంతి ఉన్నప్పటికీ, అతను నేలపైకి దూకినప్పుడు బంతి కాస్త గడ్డిని తాకుతున్నట్లు స్పష్టంగా కనిపించింది. బంతిపై ఫీల్డర్‌కు పూర్తి నియంత్రణ లేదని అంపైర్ భావించారు.

**స్క్రీన్‌పై 'నాట్ అవుట్'.. మైదానంలో వాదోపవాదాలు..**
దీర్ఘంగా పరిశీలించిన తర్వాత థర్డ్ అంపైర్ మదనగోపాల్ బ్యాటర్‌కు అనుకూలంగా నిర్ణయం ప్రకటిస్తూ పెద్ద తెరపై 'నాట్ అవుట్' అని ప్రదర్శించారు. దాంతో వాషింగ్టన్ సుందర్ తృటిలో పెను ప్రమాదం నుండి తప్పించుకుని మళ్లీ బ్యాటింగ్ చేయడానికి సిద్ధమయ్యాడు. అయితే ఈ నిర్ణయంపై బెంగళూరు ఆటగాడు రజత్ పాటిదార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. అంపైర్ నితిన్ మీనన్ దగ్గరకు వెళ్లి సుదీర్ఘంగా వాదించడం మైదానంలో ఉత్కంఠను మరింత పెంచింది. బంతి చేతి వేళ్ల మధ్యే ఉందని, అది అవుట్ అని బెంగళూరు పట్టుబట్టినా అంపైర్లు మాత్రం తమ నిర్ణయానికే కట్టుబడ్డారు.

క్రికెట్ చరిత్రలో ఫైనల్ లాంటి ప్రతిష్టాత్మక మ్యాచ్‌లలో వచ్చే ఇలాంటి సాంకేతిక వివాదాలు ఆట గమనాన్నే మార్చేస్తుంటాయి. ఈ ఉత్కంఠభరిత క్యాచ్ విషయంలో థర్డ్ అంపైర్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని కొందరు అంటుంటే, బెంగళూరు అభిమానులు మాత్రం దీనిని తప్పుబడుతున్నారు. ఏదేమైనా ఈ ఒక్క నిర్ణయం మ్యాచ్‌లో ఎంతటి ఉత్కంఠను నింపిందో, రాబోయే రోజుల్లో ఎలాంటి చర్చలకు దారితీస్తుందో చూడాలి.

## ఆసియా క్రీడల బెర్తులు ఖరారు.. మూడు పసికూనలకు అవకాశం..!




ఆసియా క్రీడల్లో పోటీపడే మహిళల క్రికెట్ జట్లు ఖరారయ్యాయి. భారత్, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి మేటి జట్లతో చైనా, థాయ్‌లాండ్, మలేషియా తలపడే అవకాశాన్ని దక్కించుకున్నాయి. కౌలాలంపూర్ వేదికగా జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో చివరి మూడు బెర్తులను ఈ మూడు పట్టేశాయి. క్వాలిఫయింగ్ టోర్నీలో మలేషియా, థాయ్‌లాండ్ ఫైనల్ చేరగా.. చైనా మూడో స్థానంతో ఆసియా క్రీడలకు అర్హత సాధించింది.మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో మే 26 నుంచి మే 31 వరకూ ఆసియా క్రీడల క్రికెట్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్ జరిగింది. గ్రూప్ ఏలో మలేషియా, హాంకాంగ్‌పై విజయాలతో థాయ్‌లాండ్ అగ్రస్థానం సాధించింది. గ్రూప్ బీలో ముందున్న నేపాల్.. సెమీఫైనల్లో మలేషియా చేతిలో ఓడింది. ఫైనల్లో తలపడిన మలేషియా, థాయ్‌లాండ్ జట్లకు నేరుగా ఆసియా క్రీడల బెర్తు దక్కిందిమూడో స్థానం కోసం చైనా, నేపాల్ పోటీపడగా.. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఐదు వికెట్లతో గెలుపొందిన చైనా అర్హత సాధించింది. ఈ ఏడాది సెప్టెంబర్ -- అక్టోబర్ మధ్యలో జపాన్‌లోని ఐచి ప్రిఫెక్చుర్, నగొయ ప్రాంతాల్లో ఆసియా క్రీడల క్రికెట్ పోటీలు జరుగనున్నాయి.

**మహిళల క్రికెట్ జట్లు**
భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్థాన్, జపాన్, చైనా, మలేషియా, థాయ్‌లాండ్

## వైభవ్ చాలా ప్రత్యేకమైన క్రికెటర్..

### టెస్టుల్లో ఆడితే చూడాలనుంది..!



: భారత క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటను దిగ్గజ ఆటగాళ్లు వేనోళ్ల పొగుడుతున్నారు. ఐపీఎల్ 19లో వైభవ్ తుఫాన్ ఇన్నింగ్స్‌లు చూసి అతడు నా ఫేవరెట్ క్రికెటర్ అని ప్యాట్ కమిన్స్.. ప్రస్తుతం ప్రపంచంలోనే ఉత్తమ ఆటగాళ్లలో వైభవ్ ఒకడు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చెప్పేశారు. పదిహేనేళ్లకే దునియా మొత్తాన్ని తనవైపు తిప్పుకున్న ఈ కుర్రాడికి క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ ప్రశంసలూ దక్కాయి. వైభవ్ చాలా ప్రత్యేకమని, అతడి మణికట్టు మ్యాజిక్ అద్భుతమైని సచిన్ పేర్కొన్నాడు.ప్రపంచ క్రికెట్‌లో వంద శతకాలతో చరిత్ర సృష్టించిన సచిన్ టెండూల్కర్ ఐపీఎల్‌లో దుమ్మురేపిన వైభవ్ సూర్యవంశీని ఆకాశానికెత్తేశాడు. క్రిక్‌ఇన్ఫో 21వ శతాబ్దపు ఉత్తమ పురుష క్రికెటర్ అవార్డుకు ఎంపికైన సచిన్ మాట్లాడుతూ వైభవ్ చాలా ప్రత్యేకమైన క్రికెటర్ అని చెప్పాడు. వైభవ్ చాలా ప్రత్యేకమైన ఆటగాడు. సహజసిద్ధంగా అతడికి అబ్బిన క్రికెట్ నైపుణ్యాలతో ఎవరూ పోటీపడలేరు. ప్రతిఒక్కరూ సూర్యవంశీ గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. కానీ, నేను అతడి ఆటను గమనిస్తున్నా. ఎంతో గొప్పగా ఆడుతున్నాడు.అతడు బంతిని బాదే సామర్థ్యం మాత్రమే కాదు అతడు మణికట్టును కదిలించే తీరు అద్భుతం. మైదానం నలువైపులా షాట్లు ఆడాలంటే మణికట్టును మెరుపులా కదలించడం కీలకం. వైభవ్ బంతిని బాదడం కాదు.. లైన్ అండ్ లెంగ్త్‌ను అందరికంటే ముందే పసిగడుతున్నాడు. దాంతో, అలవోకగా బంతిని స్టాండ్స్‌లోకి పంపుతున్నాడు అని వైభవ్ ఆటను విశ్లేషించిన సచిన్ అతడిని టెస్టుల్లో చూడాలని ఆశపడుతున్నట్టు చెప్పాడు.


# రాకా' నుంచి గ్లింప్స్ రాబోతుందా

## అల్లు అర్జున్ మూడు షేడ్స్‌లో కనిపించబోతున్నాడా..!




పుష్ప' ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ అట్లీతో చేస్తున్న సంగతి తెలిసిందే. తాత్కాలికంగా 'రాకా' పేరుతో ప్రచారంలో ఉన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోణ్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా చెప్పబడుతోంది. సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నప్పటికీ, ప్రాజెక్ట్‌పై రోజుకో కొత్త వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేసే దిశగా చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోందటసినిమా ప్రపంచాన్ని, కథ నేపథ్యాన్ని, విజువల్ స్కేల్‌ను పరిచయం చేసే విధంగా ఈ గ్లింప్స్‌ను రూపొందిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అట్లీ తన సినిమాల్లో భారీ విజువల్స్, మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ కథనాలకు పేరుగాంచిన దర్శకుడు. ఈసారి అల్లు అర్జున్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి విజువల్ అనుభూతిని అందించేలా 'రాకా'ను రూపొందిస్తున్నట్లు సమాచారం. అందుకే గ్లింప్స్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాలో అల్లు అర్జున్ పాత్రకు సంబంధించిన ఆసక్తికర వార్త కూడా వైరల్ అవుతోంది. అందుతున్న సమాచారం ప్రకారం బన్నీ ఈ చిత్రంలో మూడు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నారట. కథలో కీలకమైన మూడు దశలను ప్రతిబింబించేలా ఆయన పాత్ర డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇప్పటికే షూటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అట్లీ ముందుగా సిద్ధం చేసుకున్న ప్రణాళిక ప్రకారమే చిత్రీకరణ జరుగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. ఇక సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయన కంపోజ్ చేస్తున్న ట్యూన్స్‌పై చిత్ర యూనిట్ చాలా నమ్మకంగా ఉందని తెలుస్తోంది. సినిమా కథ, విజువల్స్‌తో పాటు సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్లింప్స్ విడుదలపై వస్తున్న వార్తలపై అధికారికంగా క్లారిటీ లేదు. గ్లింప్స్ విడుదలైతే 'రాకా' ప్రపంచం ఎలా ఉండబోతోందో, అట్లీ-బన్నీ కాంబినేషన్ ప్రేక్షకులకు ఎలాంటి సరికొత్త అనుభూతిని అందించబోతోందో తొలి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.







నెట్టింట 'చిట్టి' హాట్ షో..

# వెంకటేష్-త్రివిక్రమ్ 'ఏకే47'లో కొత్త ట్విస్ట్..

## కీలక పాత్రలో దేవయాని శర్మ?

టాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న చిత్రాల్లో వెంకటేష్ -- త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 (ఏకే47)' ఒకటి. కుటుంబ కథా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఈ ఇద్దరి కలయికలో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు త్రివిక్రమ్ అందించిన మాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత వెంకటేష్‌తో మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది.ఈ సినిమాలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ శరవేగంగా సాగుతోంది. కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్న తరుణంలో సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతోంది.ప్రముఖ వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్' ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి దేవయాని శర్మ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. కథలో ఆమె పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని, సినిమా నడకలో ముఖ్యమైన మలుపులకు కారణమయ్యే పాత్రగా ఉండొచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఆమె పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలు మాత్రం ఇంకా గోప్యంగానే ఉంచారు.దేవయాని శర్మకు ఇది కెరీర్ పరంగా మరో పెద్ద అవకాశం కానుంది. ఇప్పటికే 'సేవ్ ది టైగర్స్' ద్వారా కుటుంబ ప్రేక్షకులకు చేరువైన ఆమె, ఇప్పుడు వెంకటేష్-త్రివిక్రమ్ వంటి క్రేజీ కాంబినేషన్ సినిమాలో నటించడం ద్వారా మరింత గుర్తింపు పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇదిలా ఉంటే, దేవయాని శర్మ నటించిన 'సేవ్ ది టైగర్స్' మూడో సీజన్ కూడా విడుదలకు సిద్ధమవుతోంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. జూన్ 19 నుంచి ఈ సిరీస్ ప్రేక్షకుల ముందుకు రానుండగా, గత రెండు సీజన్ల మాదిరిగానే ఈసారి కూడా వినోదభరితంగా ఉండబోతుందని భావిస్తున్నారు.ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. వెంకటేష్, శ్రీనిధి శెట్టితో పాటు నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేష్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతాన్ని హర్షవర్ధన్ రామేశ్వర్ అందిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలు, వినోదం, త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వెంకటేష్ నటన ప్రధాన ఆకర్షణలుగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు దేవయాని శర్మ ఎంట్రీ వార్తతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. విడుదల తేదీతో పాటు ఇతర వివరాలను చిత్ర బృందం త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.




# విడాకులపై హన్సిక ఎమోషనల్ కామెంట్స్..

## -నా పరిస్థితి చూసి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు..

సినీ పరిశ్రమలో సెలబ్రిటీల విడాకులు తరచూ వార్తల్లో నిలుస్తూనే ఉంటాయి. ప్రేమగా మొదలైన బంధాలు అనుకోని కారణాలతో ముగిసిపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తుంటుంది. తాజాగా నటి హన్సిక తన వైవాహిక జీవితానికి ముగింపు పలికిన అనంతరం మొదటిసారి ఈ అంశంపై బహిరంగంగా స్పందించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భర్త సోహైల్ ఖతూరియాతో విడిపోవాలని నిర్ణయించుకున్న తర్వాత ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో హన్సిక తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న భావోద్వేగ పరిస్థితులను వివరించారు. జీవితంలో కొన్ని నిర్ణయాలు కఠినంగా అనిపించినప్పటికీ, అవి మన మంచికే అయితే వాటిని ఆలస్యం చేయకుండా తీసుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు.ఒక నిర్ణయం తప్పు అని అనిపిస్తే దాన్ని సరిదిద్దుకోవడానికి వెనుకాడకూడదు. గత రెండేళ్లుగా నా మానసిక పరిస్థితి చాలా ప్రభావితమైంది. సాధారణంగా నేను చాలా ఉల్లాసంగా, ఆనందంగా ఉండే వ్యక్తిని. కానీ ఆ సమయంలో పూర్తిగా నిశ్శబ్దంగా, బాధతో ఉండేదాన్ని. నా పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులు కూడా చాలా ఆందోళన చెందారు అని హన్సిక తెలిపారు. తన జీవితంలో అత్యంత క్లిష్టమైన దశలో ఒక స్నేహితురాలు అండగా నిలిచిందని ఆమె చెప్పారు. నా పరిస్థితిని గమనించిన ఓ స్నేహితురాలు డాక్టర్‌ను సంప్రదించి నాకు థెరపీ అవసరమని సూచించింది. ఆ తర్వాత నేను కౌన్సెలింగ్ తీసుకున్నాను. ఆ ప్రక్రియ నాకు ఎంతో సహాయపడింది. ఈ రెండేళ్ల జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పించాయి. సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, ఎలా ముందుకు సాగాలి అనే విషయాలు నేర్చుకున్నాను అని వెల్లడించారు. విడాకుల తర్వాత తనపై సోషల్ మీడియాలో, మీడియాలో వచ్చిన ప్రచారాలపై కూడా హన్సిక స్పందించారు. ప్రజలు ఎక్కువగా సంచలన వార్తలనే ఇష్టపడతారు. అందుకే నా గురించి కూడా అనేక రకాల గాసిప్స్ ప్రచారంలోకి వచ్చాయి. అయితే వాటికి నేను ఎప్పుడూ వివరణ ఇవ్వలేదు. భవిష్యత్తులో కూడా ఇవ్వాలనుకోవడం లేదు. ఇతరులు ఏమనుకుంటారన్నది కంటే నా సంతోషం నాకు ముఖ్యం అని స్పష్టం చేశారు. అలాగే తమ విడాకుల నిర్ణయం పరస్పర అంగీకారంతో తీసుకున్నదేనని హన్సిక తెలిపారు. వివాహం అనేది ఇద్దరి వ్యక్తిగత ఎదుగుదలకు దోహదపడాలి. కానీ మా పరిస్థితిలో అది జరగలేదు. అందుకే మేమిద్దరం కలిసి ఈ నిర్ణయం తీసుకున్నాం అని చెప్పారు. ప్రస్తుతం తాను జీవితాన్ని ప్రశాంతంగా గడుపుతున్నానని, ఎవరికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేకుండా స్వేచ్ఛగా జీవిస్తున్నానని హన్సిక వెల్లడించారు. ఒంటరిగా గడపడం, ఆధ్యాత్మిక యాత్రలు చేయడం ద్వారా మనశ్శాంతి పొందుతున్నానని తెలిపారు. ఈ కష్టకాలంలో తన కుటుంబ సభ్యులు అందించిన మద్దతును ఆమె ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు

# ఆమె నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా



ప్రస్తుతం భారీ అంచనాలతో తెరకెక్కుతున్న పానిండియా సినిమాల్లో 'టాక్సిక్' తొలి వరుసలో ఉంటుంది. 'కేజీఎఫ్'ఫేం యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా కియారా తన తాజా ఇంటర్వ్యూలో 'టాక్సిక్' సెట్‌లో తన అనుభవాలను పంచుకున్నది. 'డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా. టైమ్‌కి చాలా విలువ ఇచ్చేవారామె. ఒకసారి ఫోన్ చేసి.. 'రేపు నువ్వు సెట్‌లోకి రాగానే పూర్తిగా పాత్రలోనే ఉండాలి. ఎలాంటి మర్యాదలు, పలకరింపులు వద్దు.నేరుగా క్యారెక్టర్ జోన్‌లోకి వచ్చేయాలి' అని సీరియస్‌గా చెప్పారు. నిజానికి నేను ఆ విధానానికి పూర్తి వ్యతిరేకం. సెట్‌లోకి రాగానే ముందు అందర్నీ విష్ చేయడం నాకు అలవాటు. లొకేషన్లో ఉత్సాహంగా ఉండే మనిషిని. కానీ డైరెక్టర్ మాట వినాలి కాబట్టి తను చెప్పినట్టే చేశాను' అని గుర్తు చేసుకున్నది కియారా అద్వాణీ. ఇందులో నదియా అనే పాత్రలో కియారా నటిస్తుండగా, నయనతార గంగ పాత్రలో కనిపించనున్నది. 'ఎలిజిబెత్' అనే పాత్రలో హ్యూమా ఖురేషి, 'రెబెకా'గా తారా సుతారియా, 'మెలిసా' పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించనున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com